
సాక్షి నిజామాబాద్

సోమవారం, 1, ఏప్రిల్, 2024



మంజీరపై కొత్త వంతెన..

తెలంగాణ – మహారాష్ట్ర మధ్య సాలూర మండల శివారులో మంజీరపై నిర్మించిన వంతెనను ఇటీవల ప్రారంభించారు.

- 8లో ▸



గరిష్ఠం/కనిష్ఠం

41.5 /26.8

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జిల్లా ఇంటర్ విద్యాధికారిగా రవికుమార్



నిజామాబాద్‌అర్బన్: జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిగా రవి కుమార్ నియమితులయ్యారు. ఆదివారం ఇన్‌చార్జి బాధ్యతలను కేటాయిస్తూ రాష్ట్ర అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకు ఉన్న డీఐఈవో రఘురాజ్ పదవీ విరమణ చేశారు. దీంతో రవికుమార్‌కు బాధ్యతలు అప్పగించారు. ఆయన వర్ని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, ఇంటర్ మూల్యాంకన కేంద్రం అధికారిగా కొనసాగుతున్నారు. సోమవారం బాధ్యతలను చేపట్టనున్నారు.

రఘురాజ్‌కు సన్మానం

నగరంలోని బస్వాగార్డెన్‌లో డీఐఈవోగా పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రఘురాజ్‌ను లెక్చరర్ల సంఘం నాయకులు, ఇతర ఉద్యోగులు సన్మానించారు. అనంతరం రఘురాజ్ మాట్లాడుతూ విధుల్లో సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ ఎన్నికల ఇన్‌చార్జీగా సుదర్శన్‌రెడ్డి



ఖలీల్‌వాడి: నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జీగా మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్ మున్షీ ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికలకు సంబంధించి పార్టీ ప్రచార కార్యక్రమాలు, ఇతర వ్యవహారాలు అన్నీ ఆయన నేతృత్వంలో జరగనున్నాయి. దీంతో పాటు నిజామాబాద్ పార్లమెంట్ ఏఐసీసీ ఇన్‌చార్జిగా విష్ణునాథ్‌ను నియమించారు.

జహీరాబాద్ ఇన్‌చార్జీగా దామోదర రాజనర్సింహ

సాక్షి, కామారెడ్డి: జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జీగా మంత్రి దామోదర రాజనర్సింహ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్ మున్షీ ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికలకు సంబంధించి పార్టీ ప్రచార కార్యక్రమాలు, ఇతర వ్యవహారాలు అన్నీ ఆయన నేతృత్వంలో జరగనున్నాయి.

జహీరాబాద్ ఎంపీ స్థానం మనదే!



సాక్షి, కామారెడ్డి: జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో గెలుపు కాంగ్రెస్‌దేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను భారీ మెజారిటీతో గెలిపించేందుకు నేతలు కృషి చేయాలని సూచించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో జహీరాబాద్ పార్లమెంట్ నియోజక వర్గంలోని ఆయా అసెంబ్లీ నియోజక వర్గాల నేతలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికలపై నేతలతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో మెజారిటీ ఎమ్మెల్యే స్థానాలను కాంగ్రెస్ గెలుచుకుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మరింత కష్టపడితే భారీ మెజారిటీతో పార్టీ అభ్యర్థి గెలుస్తారన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి ఓట్లడగాలని సూచించారు.

పాతాళానికి గంగమ్మ!



దొంకేశ్వర్‌లో నీరందక ఎండుతున్న పొలం



- ఆందోళన కలిగిస్తున్న నీటి మట్టాలు
- మార్చిలో మరింత తగ్గిన భూగర్భ జలాలు
- వట్టిపోతున్న వ్యవసాయ బోర్లు, ఎండుతున్న పొలాలు
- జిల్లాలో కనిపిస్తున్న కరువు ఛాయలు

డొంకేశ్వర్(ఆర్మూర్): భూగర్భ జలశాఖ విడుదల చేసిన మార్చి నెల గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నాయి. వాటిని పరిశీలించి చూస్తే జిల్లా వ్యాప్తంగా నీటిమట్టాలు ప్రమాదకరస్థితికి చేరువయ్యాయి. సగటు కంటే 12.30 మీటర్ల లోతులోకి భూగర్భ జలాలు పడిపోయాయి. ఇంతే వేగంగా నీళ్లు అడుగంటితే రానున్న రోజుల్లో గడ్డు పరిస్థితులు వచ్చే అవకాశాలున్నాయి. అయితే, ఇప్పటికే జిల్లాలో కరువు ఛాయలు కనిపిస్తున్నాయి. చాలా ప్రాంతాల్లో వ్యవసాయ, గృహ వినియోగ బోర్లకు నీరందడం లేదు. మోటార్లు ఆగుతూ పోస్తున్నాయి. దీంతో పంట పొలాలతో పాటుగా తాగునీటికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో వరి ఇంకా పొట్టదశలో ఉంది. బోర్లు వట్టిపోవడంతో పొలాలు ఎండుతున్నాయి. పంటను కాపాడుకునేందుకు పక్క పొలం రైతుల బోర్లను వాడుకుంటున్నారు. ఆపదలో ఎత్తిపోతల పథకాలు ఆదుకుని పంటలను గట్టెక్కిస్తున్నాయి. జిల్లాలో మొత్తం 82 ఫీజో మీటర్లు ఉండగా, సగం ఫీజో మీటర్లలో నీటి మట్టాలు ప్రమాదకరస్థాయిలో ఉన్నాయి. అయితే, వరి కోతలు పూర్తయిన ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెద్దగా తగుముఖం పట్టడం లేదు. పంట ఇంకా చేతికిరాని ప్రాంతాల్లోనే బోర్లను వినియోగిస్తుండడంతో జలాలు ఇంకా లోతుకి వెళ్తున్నాయి.

ఐదు నెలల్లో భూగర్భ జలాల పరిస్థితి

నెల	మీటర్లు
నవంబర్(2023)	7.22
డిసెంబర్(2023)	8.80
జనవరి	10.06
ఫిబ్రవరి	11.34
మార్చి	12.30

ఈ ప్రాంతాల్లో ప్రమాదకర పరిస్థితి

జిల్లాలో దాదాపు ముప్పైకి పైగా ప్రాంతాల్లో భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే, గడిచిన ఐదు నెలల్లో నెలకు ఒక మీటరు చొప్పున నీటి మట్టాలు తగ్గిపోయాయి. గతేడాది ఇదే సమయానికి మార్చితో పోల్చి చూస్తే ఒక మీటరు లోతులోకి వెళ్లాయి. సాధారణ స్థాయి కంటే డిచ్‌పల్లి మండలం యానంపల్లిలో 6.17 మీటర్ల లోతులో ఉన్నాయి. పాతంగల్ మండలం టాక్లీలో 5.84, సిరికొండ మండలం చీమన్‌పల్లిలో 5.47, ధర్పల్లి మండలం హొన్నాజీపేట్‌లో 4.54, భీమ్‌గల్‌లో 4.68, గోనుగొప్పులలో 4.12, మోపాల్‌లో 4.0, నందిపేట్ మండలం బాద్గుణలో 3.60 మీటర్ల లోతులో భూగర్భ జలాలున్నాయి. ప్రస్తుత ఏప్రిల్, మే నెలల్లో కూడా నీటి వాడకం ఎక్కువగా ఉండనున్న నేపథ్యంలో జలాలు ఏ స్థాయికి చేరుకుంటాయోనని ఆందోళన కలిగిస్తోంది. నీటిని పొదుపుగా వాడుకోకపోతే బెంగళూరు లాంటి పరిస్థితులు వచ్చే ప్రమాదముందని సంబంధిత అధికారులు హెచ్చరిస్తున్నారు.

“ పదిహేనేళ్ల తర్వాత ఇప్పుడే చూస్తున్నా..



యాసంగిలో ఐదెకరాల్లో వరి పంట వేసిన. భూగర్భ జలాలు పడిపోవడంతో రెండు బోర్లు నీరందక ఆగుతూ పోస్తున్నాయి. పొట్టదశలో ఉన్న పొలానికి నీళ్లులేక ఎండే పరిస్థితి వచ్చింది. పక్కభూముల్లో ఉన్న వేరే రైతు బోరు ద్వారా నీటిని అందించి పంటను కాపాడుతున్నా. గత పదిహేనేళ్లలో ఇలాంటి పరిస్థితులు ఎప్పుడూ చూడలేదు. పంటలు సాగు చేయాలంటే భయమేస్తోంది.

– గొల్ల భూమేశ్, రైతు, నికాల్‌పూర్

ముమ్మరంగా మరమ్మతులు



వరద గేట్ల మరమ్మతులు చేపడుతున్న కూలీలు



- రెండేళ్ల క్రితం నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం
- ఎస్సారెస్పీలో నీటిమట్టం తగ్గడంతో వేగంగా పనులు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వరద గేట్ల మరమ్మతులు వేగంగా సాగుతున్నాయి. ప్రాజెక్టుకు మొత్తం 42 వరద గేట్లు ఉన్నాయి. నాలుగేళ్ల క్రితం విడుదలైన ప్రత్యేక నిధులతో ఆరు గేట్లకు మరమ్మతులు చేశారు. మిగతా 36 గేట్ల మరమ్మతులకు రెండేళ్ల క్రితం ప్రభుత్వం రూ.17.5 కోట్లు మంజూరు చేసింది. కానీ సీజనల్‌గా చేపట్టే పనులు కావడంతో ఇప్పటి వరకు 20 గేట్ల మరమ్మతులు మాత్రమే పూర్తయ్యాయి. రెండేళ్లుగా ప్రాజెక్ట్‌లో నీటిమట్టం అధికంగా ఉండటంతో పనులు చేపట్టడానికి వీలు కాలేదు. వేసవిలో కూడా 20 టీఎంసీల కంటే ఎక్కువ నీరు ఉండటంతో స్టాప్‌లాక్ గేట్లు వేసుకుని పనులు చేపట్టారు. దీంతో పనులు నెమ్మదిగా సాగాయి. ప్రస్తుతం జలాశయంలో నీటి మట్టం వేగంగా తగ్గుతోంది. 16 టీఎంసీలకు నీటి నిల్వ పడిపోయింది. మరో వారం రోజులు నీటి విడుదల కొనసాగే అవకాశం ఉండటంతో నీటిమట్టం మరింత తగ్గనుంది. అప్పుడు స్టాప్‌లాక్ గేట్లు వేసుకోకుండనే మరమ్మతులు చేపట్టవచ్చు. మళ్లీ ఇంత తక్కువకు నీటిమట్టం పడిపోయే అవకాశం అరుదు.. దీంతో పనులు వేగంగా చేపడుతున్నారు. ప్రస్తుతం మరో ఏడు గేట్లకు స్టాప్‌లాక్ గేట్లు వేసి మరమ్మతులు ప్రారంభించారు. వీటి పనులు పూర్తయ్యేలోపు నీటి మట్టం మరింత తగ్గుతుంది. అప్పుడు పనులు వేగంగా చేపట్టవచ్చు.

రక్షణ లేకుండా పనులు

వరద గేట్ల మరమ్మతు పనులను కూలీలు రక్షణ లేకుండా చేపడుతున్నారు. సేఫ్టీ బెల్టులు పెట్టుకోకుండా గేట్లపైకి ఎక్కి పనులు చేస్తున్నారు. పట్టు తప్పి గోదావరిలో పడితే ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. ఉన్నతాధికారులు స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

“ వేగవంతం చేయాలని ఆదేశించాం

వరద గేట్ల మరమ్మతులు మరింత వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. ప్రస్తుతం ఏడు గేట్లు పనులు సాగుతున్నాయి. నీటి మట్టం తగ్గుతుండటంతో పనులు సులువుగా చేపట్టవచ్చు.

– వంశి, ఏఈఈ, ఎస్సారెస్పీ

నవోదయ ఫలితాలు విడుదల

నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతి ప్రవేశ కోసం నిర్వహించిన పరీక్ష ఫలితాలు ఆదివారం విడుదల అయ్యాయని ప్రిన్సిపాల్ సత్యవతి తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి 5,252 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 3,728 మంది పరీక్షకు హాజరయ్యారు. అందులో నుంచి 80 మంది నవోదయకు ఎంపిక అయ్యారని ఆమె తెలిపారు. ఎంపికైన విద్యార్థుల హాల్‌టికెట్ నంబర్లను ఆన్‌లైన్‌లో పొందుపర్చినట్లు వివరించారు.



నిజాంసాగర్ జవహర్ నవోదయ విద్యాలయం

శేష వాహనంపై శ్రీవారు



శేషవాహనంపై స్వామివారిని ఊరేగిస్తున్న అర్చకులు, భక్తులు

- కొనసాగుతున్న ఇందూరు తిరుమల బ్రహ్మోత్సవాలు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): నర్సింగ్‌పల్లిలోని ఇందూరు తిరుమల దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం రెండోరోజూ కొనసాగాయి. దేవనాథ జీయర్ స్వామి, ఆచార్య గంగోత్రి రామానుజ దాసు స్వామి యజ్ఞశాలలో పాంచహ్నిక హవన కార్యక్రమంలో అగ్ని ప్రతిష్ఠ ద్వారతోరణం పూజ కుంభ ప్రతిష్ఠ మాధ్యాహ్నిక పూర్ణాహుతి నిర్వహించారు. గుడ ధ్వజారోహణ దేవత ఆహ్వానం జరిపి సంతానార్థులకు గరుడ ప్రసాదం అందించారు. మానసా వాచ కర్మనా ఆ దేవుడిని నమ్మితే కలికాలంలో ఎటువంటి ఇబ్బందులు ఉండవని దేవనాథ జీయర్ స్వామి ప్రవచించారు. ఉత్సవం అంటే లోకం అంత సంతోషించడమని, బ్రహ్మోత్సవం అంటే సాక్షాత్తు బ్రహ్మనే లోక కల్యాణం కోసం జరిపించే ఉత్సవమని ఆచార్య గంగోత్రి రామానుజ దాసు స్వామి పేర్కొన్నారు. సాయంత్రం స్వామి వారిని శేషవాహనంలో మాడ వీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త నిర్మాత శిరీష్, నటుడు సురేందర్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు నరసింహారెడ్డి, విజయసింహారెడ్డి, రవి యాదవ్, నర్సారెడ్డి, నరాల సుధాకర్, ప్రసాద్, రాజేశ్వర్, రమేశ్, సాయిలు, భాస్కర్, మూర్తి, మురళి, చిన్నయ్య, ప్రమోద్, గంగారెడ్డి, లక్ష్మి, యజ్ఞాచార్యులు ఆచార్య శిఖామణి స్వామి, శ్రీకర్ ఆచార్య, స్వామి రోహిత్ కుమారాచార్యులు, విజయ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ధాన్యం కొనుగోళ్లు

- జిల్లాలో 466 కేంద్రాల ఏర్పాటు
- 6 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణే లక్ష్యం
- ఊపందుకున్న వరి కోతలు



రెంజల్(బోధన్): జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లాలో గత 15 రోజుల క్రితమే ధాన్యం కోతలు ప్రారంభమయ్యారు. ఇప్పటికే 15 నుంచి 20 శాతం కోతలు పూర్తయ్యాయి. అయితే ప్రైవేటు వ్యాపారులు ప్రారంభంలో పచ్చి ధాన్యానికి క్వింటాకు రూ. 2,200 చెల్లించి రైతుల వద్ద నుంచి కొనుగోలు చేశారు. కానీ వారం వ్యవధిలోనే రూ. 1,900 తగ్గించడంతో పాటు కింటాలుకు 4 కిలోల వరకు తరుగు తీస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు కాస్త ఆలస్యమవడంతో కొందరు రైతులు ప్రైవేటుకు విక్రయించుకున్నారు.

ఏ గ్రేడ్ క్వింటాల్‌కు రూ. 2,203..

జిల్లాలో సోమవారం నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభించనున్నారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ రకానికి రూ. 2,203, బీ గ్రేడ్ రకానికి రూ. 2,108 ధరను నిర్ణయించింది. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చే రైతులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం తేమశాతం తగ్గకుండా అందించాల్సి ఉంటుంది. జిల్లాలో ప్రభుత్వ పరంగా 466 కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నారు. ఇందులో సొసైటీల ఆధ్వర్యంలో 379, ఐకేపీ ఆధ్వర్యంలో 45, మ్యాక్స్ ఆధ్వర్యంలో 2, మెప్మా ఆధ్వర్యంలో 8 కేంద్రాలను ప్రారంభిస్తున్నారు. జిల్లాలో 1,66,753 ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తున్నారు. సుమారు 11.50 మెట్రిక్ టన్నుల దిగుబడి రానుంది. ఇందులో 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించింది.

ఐరిస్ విధానం అమలయ్యేనా..?

కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలను అడ్డుకునేందుకు పౌర సరఫరాల శాఖ ఈ సారి ఐరిస్ విధానం తీసుకొచ్చింది. గతంలో రైతులు ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా, ఆధార్ నంబర్‌ను నమోదు చేస్తే వారి సెల్‌కు ఓటీపీ వచ్చేది. దానిని ట్యాబ్‌లో నమోదు చేసి ఓటీపీ ద్వారా ధాన్యం విక్రయించే అవకాశం ఉండేది. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతుల పేరుతో వ్యాపారులు, దళారులు విక్రయిస్తున్నట్లు గుర్తించిన అధికారులు ఐరిస్ అమలుచేయాలని నిర్ణయించారు. పూర్తిస్థాయిలో ఈ విధానం అమలైతే కొందరు దళారులు రైతుల వద్ద తక్కువ ధరకు సేకరించిన ధాన్యాన్ని వారి పేరుతో కొనుగోలు కేంద్రాల్లో విక్రయించే పద్ధతిని అరికట్టవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఐరిస్ అమలైతే స్వయాన రైతు పాస్ పుస్తకంతో వచ్చి విక్రయించాల్సి ఉంటుంది. ఒకరి పేరున మరొకరు అమ్ముకునే అవకాశం కుదరదు. ఈ విధానం అమలుచేస్తే కౌలు రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారనుంది. రెవెన్యూ అధికారుల నుంచి ముందుగా కౌలుపత్రాలు తీసుకున్న రైతులే అర్హులవుతారు. జిల్లాలో చాలామంది కౌలు రైతులు ఒప్పందం ప్రకారం కౌలు చేస్తున్నారు. అధికారులు ఆలోచించాలని కౌలు రైతులు కోరుతున్నారు.

పార్లమెంట్‌లో తెలంగాణ గళం వినిపిస్తా

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

సిరికొండ: తనను ఎంపీగా గెలిపిస్తే పార్లమెంట్‌లో తెలంగాణ గళం వినిపిస్తానని బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. మండలంలోని రావుట్ల గ్రామంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎంపీ అర్వింద్ ప్రధాని మోదీ పేరు చెప్పి ఓట్లు అడగడం కాదని, నిజామాబాద్‌కు ఏం చేశాడో చెప్పాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల్లో పసుపు బోర్డు పేరు మీద బాండ్ పేపర్‌తో మోసం చేసిన అర్వింద్, ఈ ఎన్నికల్లో పసుపు బోర్డు జీవో కాపీ పేరిట కొత్త నాటకం మొదలెట్టారని ఎద్దేవా చేశారు. ఐదేళ్లలో కేసీఆర్‌ను తిట్టడం తప్ప ఎంపీ నియోజకవర్గానికి ఒక రుపాయి అభివృద్ధి చేయలేదన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు వారి పార్టీ అభ్యర్థి మధుయాష్కీని మోసం చేసి అర్వింద్‌కు క్రాస్ ఓటింగ్ చేయించారని ఆరోపించారు. పసుపు బోర్డు ఎక్కడ ఏర్పాటు చేస్తారో స్పష్టంగా చెప్పకుండా మళ్లీ మోసం చేసేందుకు తెర లేపారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం 110 రోజుల్లోనే తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుందన్నారు. రాష్ట్రంలో పంటలు ఎండుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి ఎమ్మెల్సీగా గెలిచాక కనిపించకుండా పోయారని ఆరోపించారు. జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్టుకు భూసేకరణ చేయకుండా కేంద్ర ప్రభుత్వం తాత్సారం చేస్తోందని విమర్శించారు. దేశంలో పసుపు సాగు తగ్గడంతోనే ధర పెరిగిందని, తమ కృషి వల్లనే పెరిగిందని ఎంపీ అర్వింద్ చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. నిజామాబాద్ ఎంపీగా తనకు ఒకసారి అవకాశం ఇవ్వాలని కోరారు. జెడ్పీటీసీ మాన్‌సింగ్, పార్టీ నాయకులు రాజన్న, రమేశ్, గంగాధర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

శ్రీవైష్ణవులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

- కేంద్ర మాజీమంత్రి వేణుగోపాలచారి

నిజామాబాద్ సిటీ: శ్రీవైష్ణవులు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ఉపయోగించుకుని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని బీఆర్ఎస్ సీనియర్ నేత, కేంద్ర మాజీమంత్రి సముద్రాల వేణుగోపాలచారి అన్నారు. ఆదివారం నిజామాబాద్ బ్రహ్మపురి(గాజుల్‌పేట్) ఎంజీ ఫంక్షన్‌హాల్‌లో శ్రీ వైష్ణవ సేవా సంఘం రజతోత్సవ సన్నాహక సమావేశం, ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. సమాజంలోని అన్ని కులాల ప్రజలు అభివృద్ధి చెందుతున్నారని, శ్రీ వైష్ణవ సంఘం ఇప్పటికీ వెనుకబడిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ఉపయోగించుకుని అభివృద్ధి చెందాలని సూచించారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలందించిన చిలుకమర్రి శ్రీవర్ధనాచార్యులు, శిరిసిన హల్ శ్రీనివాసచార్య, ఎంఎస్ ఆచార్య, కె.రమణాచార్య, మిట్టపల్లి శ్రీధర ఆచార్య, నరేశ్‌కుమార్, కందాళై వినోద్ కుమార్, సముద్రాల శ్రీధరాచార్య, మధుసూదన్ ఆచార్య, గోవర్ధన, సందీప్ కుమార్‌లను మాజీమంత్రి సన్మానించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తిరువేంగళాచార్యులు, ప్రధాన కార్యదర్శి సేనాపతి మోహణచార్యులు, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కండ్లకుంట యాదగిరాచార్యులు, ప్రతినిధులు చిలుకమర్రి లక్ష్మీనాథచార్యులు, బీఎస్ చార్యులు పాల్గొన్నారు.



అర్చకుడిని సన్మానిస్తున్న కేంద్ర మాజీమంత్రి వేణుగోపాలచారి

మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయం

- ఎంపీ అర్వింద్ ధర్మపురి

సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలు గెలిచి ప్రధానిగా మోదీ మూడోసారి బాధ్యతలు చేపట్టడం ఖాయమని ఎంపీ అర్వింద్ ధర్మపురి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో దేశాభివృద్ధికి అవసరమైన సలహాలు, సూచనలను వివిధ వర్గాల ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందుకోసం పార్టీ కార్యాలయంలో డ్రాప్ బాక్సును ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ పదేళ్లలో ఒక్క అవినీతి లేకుండా అభివృద్ధి ఎలా చేసుకోవాలనే మోదీ నిరూపించారని తెలిపారు. దేశవ్యాప్తంగా అన్నివర్గాల ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నామని, మేనిఫెస్టో కోసం ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. అభిప్రాయాలు స్వీకరించి, వాటి ఆధారంగా మేనిఫెస్టోను రూపొందించనున్నామని పేర్కొన్నారు. బీజేపీ ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ అని, ప్రపంచానికి మోదీ దిక్సూచిలా పని చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, కార్పొరేటర్లు స్రవంతిరెడ్డి, గద్దె భూమన్న, పంచరెడ్డి ప్రవళిక, నాగోళ్ల లక్ష్మీనారాయణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్న ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్

క్లుప్తంగా

ముగిసిన బీసీ గురుకుల ప్రవేశ పరీక్ష

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో ఆదివారం నిర్వహించిన బీసీ గురుకుల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 8వ తరగతిలో 2024–25 అడ్మిషన్ల కోసం ప్రవేశ పరీక్ష నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాలను బీసీ గురుకుల జిల్లా కో–ఆర్డినేటర్ సత్యనాథ్‌రెడ్డి పరిశీలించారు.

ప్రశాంతంగా ఉత్సవాలను నిర్వహించుకోవాలి



భిక్కనూరు : పార్టీలకతీతంగా పెద్దమ్మ వనదుర్గ ఆలయం ఉత్సవాలను నిర్వహించుకోవాలని భిక్కనూరు ముదిరాజు సంఘం అధ్యక్షుడు బండి రాములు అన్నారు. ఆదివారం భిక్కనూరు మండల కేంద్రంలోని ముదిరాజు ఫంక్షన్‌హాల్లో నిర్వహించిన ముదిరాజుల సర్వసభ్యసమావేశంలో ఆయన మాట్లాడుతూ పెద్దమ్మ ఉత్సవాల్లో రాజకీయాలకు చోటు ఇవ్వవద్దన్నారు. ఏప్రిల్ 17 నుంచి నిర్వహించే ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల కేంద్రంలోని ముదిరాజులు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుక



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో ఆదివారం ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గుడ్‌ఫ్రైడే అనంతరం వచ్చే ఆదివారం ఈస్టర్ వేడుకలను జరుపుకుంటారు. దీనిలో భాగంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్ రెవరెండ్ ప్రభాకర్, క్రైస్తవ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా వారాంతపు అంగడి



భిక్కనూరు: శ్రీ సిద్ధరామేశ్వారాలయం బ్రహ్మోత్సవాల సందర్భంగా భిక్కనూరు మండల కేంద్రంలోని కుమ్మార్‌గల్లి ఊరడమ్మ, పటేల్ విగ్రహం రామగిరి, సిద్ధగిరి సమాధులు ఉన్న ప్రాంతంలో ఆదివారం నిర్వహించిన వారాంతపు అంగడి ప్రశాంతంగా జరిగింది. ఆచారం ఆనావాయితీ ప్రకారం శ్రీసిద్ధరామేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతి ఏడాదికి ఒక్కమారు ఈ ప్రాంతంలో వారంతపు అంగడిని నిర్వహిస్తారు. అందులో భాగంగా నిర్వహించారు.

అక్రమ తవ్వకాలు ఆగేదెలా..?

- యథేచ్ఛగా తరలుతున్న చెరువులు, కుంటల మట్టి
- పట్టించుకోని అధికారులు





నర్సింగ్‌రావ్‌పల్లి చెరువులో మొరం తవ్వకాలతో ఏర్పడిన గుంతలు, చెరువు నుంచి మొరం తవ్వుతున్న పొక్లెయిన్

నిజాంసాగర్: జుక్కల్ నియోజకవర్గంలో మొరం మట్టి అక్రమ తరలింపు యథేచ్ఛగా సాగుతోంది. గ్రామాల్లోని చెరువులు, కుంటలతో పాటు కాలువ ప్రాంతాలను కొందరు అక్రమార్కులు అడ్డాగా చేసుకొని మట్టి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అపార్ట్‌మెంట్ల నిర్మాణంతో పాటు గృహాల నిర్మాణ పనుల పునాదులకు చెరువులు, కుంటల నుంచి మొరం తరలిస్తూ దర్జాగా వీరు తమ అక్రమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

ఇటుక బట్టీలకు..

నియోజకవర్గంలోని మద్నూర్, బిచ్కుంద, జుక్కల్, పెద్దకొడప్‌గల్, పిట్లం, నిజాంసాగర్ మండలాల్లో 156 చెరువులు, కుంటలు ఉన్నాయి. చెరువులు, కుంటలను ఆధారంగా చేసుకున్న ఇటుక బట్టీల వ్యాపారులు నల్లమట్టి తరలింపుపై కన్నేశారు. వీరికి సంబంధిత అధికారులు, గ్రామ ప్రజాప్రతినిధులు అండగా ఉన్నారని తెలుస్తోంది. వీరికి అక్రమార్కులు ఆమ్యామ్యాలు చెల్లిస్తుండడంతో వారి పనులకు అడ్డు రాకపోవడంతో దర్జాగా గ్రామ శివారు ప్రాంతాల్లో ఉన్న చెరువుల నుంచి నల్ల మట్టిని ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. ఆయా మండలాల్లో ఇటుక బట్టీలు అనేకంగా ఉన్నాయి. దీంతో చెరువుల్లోని నల్లమట్టి మాయమవుతోంది. చెరువుల మట్టి తరలింపునకు ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తుండడంతో ప్రభుత్వానికి రావాల్సిన నిధులు రావడంతో లేదు. కొంత నగదును అధికారులకు, గ్రామ ప్రజాప్రతినిధులు ఆశ చూపుతూ చెరువుల నుంచి నల్లమట్టిని అక్రమార్కులు అధికంగా తరలిస్తూ రూ. లక్షలు ఆర్జిస్తున్నారు. దీంతో నియోజకవర్గం వ్యాప్తంగా చెరువులు, కుం టల్లోని మట్టి, మొరం రోజు, రోజుకు ఖాళీ అవుతోంది. ఇటుక బట్టీల వద్ద నల్ల మట్టి కుప్పలు దర్శనమిస్తున్నాయి. అయితే చెరువులు, కుంటల్లో మాత్రం పెద్ద, పెద్ద గుంతలు ఏర్పడుతుండడంతో స్థానికులు, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. భారీ గుంతలతో వర్షాలకు నీరు నిండితే ప్రమాదాలు పొంచి ఉన్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అనుమతులు లేకుండా తవ్వకాలు

చెరువులు, కుంటలతో పాటు పట్టా భూముల్లో మట్టి, మొరం తవ్వకాలకు రెవెన్యూ అధికారుల అనుమతి తప్పనిసరి. కానీ అక్రమార్కులకు ఇవేవీ పట్టింపు లేకుండా తమ అక్రమ వ్యాపారాన్ని కొందరు అధికారుల అండదండలతో దర్జాగా చేపడుతున్నారు. అంతేకాకుండా అభివృద్ధి పేరిట రైతుల అసైన్డ్ భూముల్లో తవ్వకాలు చేపడుతూ కబ్జాలకు పాల్పడుతున్నారు. అసైన్డ్ భూముల్లో మట్టి, మొరం తవ్వకాలు చేపడుతుండటంతో జేసీబీ నిర్వాహకులు మొరం అమ్మకాలు చేపడుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమ మొరం, మట్టి తవ్వకాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మంజీరపై కొత్త వంతెన ప్రారంభం

- సాలూర శివారులోని మంజీర నదిపై భారీ వంతెన పూర్తి
- మూడు రోజుల క్రితం అనుమతించిన మహారాష్ట్ర అధికారులు



మంజీరపై నిర్మించిన హైలెవల్ వంతెన

బోధన్: తెలంగాణ–మహారాష్ట్ర మధ్య అంతర్రాష్ట్ర రవాణా మరింత సౌకర్యవంతంగా మారింది. సాలూర మండల శివారులోని రెండు రాష్ట్రాల మధ్య ప్రవహిస్తున్న మంజీర నదిపై ఏడాదిన్నర క్రితం చేపట్టిన హైలెవల్ భారీ వంతెన నిర్మాణం పూర్తయింది. మూడు రోజుల క్రితం మహారాష్ట్ర ప్రాంత అధికార యంత్రాంగం వంతెన మీదుగా రవాణాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో రెండు రాష్ట్రాల వైపు నుంచి వివిధ వాహనాలు, ఆర్టీసీ బస్సుల రవాణ ప్రారంభమైంది. ఈ వంతెన నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ. 120 కోట్లు మంజూరు చేయగా, మహారాష్ట్ర ప్రాంత ఇంజినీరింగ్ విభాగం పనులను పర్యవేక్షించింది. వేగవంతంగా పనులు పూర్తి చేశారు. వంతెనను 22 డబుల్ పిల్లర్లతో నిర్మించి పై భాగంలో విడిగా రెండు వరుసల్లో నిర్మించారు. నాలుగు వరుసల రోడ్డు ఉండేలా నిర్మాణం చేపట్టారు. వంతెనకు ఇరువైపులా కిలో మీటరు వరకు నాలుగు వరుసల రోడ్డు నిర్మాణంతో పాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. వంతెన పూర్తయి రవాణ ప్రారంభం కావడంతో ఇరురాష్ట్రాల సరిహద్దు ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రెండు వంతెనల మధ్య కొత్త వంతెన

1932 ఏడాది నిజాం హయాంలో సాలూర మండల శివారులోని మంజీర నదిపై రాతితో లోలెవల్ వంతెన నిర్మాణం చేపట్టారు. ప్రతి ఏటా వర్షాకాలంలో మంజీర నది వరద ఉధృతి కారణంగా వంతెన మీదుగా అంతరాష్ట్ర రవాణా వారాల తరబడి స్తంభించి పోయేది. ఈ సమస్యను అధిగమించేందుకు 1984–85లో ఉమ్మడి ఏపీ, మహారాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించి ఉమ్మడిగా పాత వంతెన దిగువన హైలెవల్ వంతెనను నిర్మించారు. ఈవంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిందని, నాలుగేళ్ల క్రితం మహారాష్ట్ర ప్రాంత అధికార యంత్రాంగం గుర్తించి కొత్త వంతెనకు ప్రతిపాదనలు చేశారు. రెండేళ్ల క్రితం నుంచి ఈ వంతెన మీదుగా రవాణాను నిలిపివేసి, పాత వంతెన మీదుగా అనుమతించారు. ఈ ఏడాది వర్షాకాలంలో పాత వంతెన మీదుగా వరద ఉధృతి ఉండటంతో అంతరాష్ట్ర రవాణాకు అంతరాయం కలిగింది. కొత్త వంతెనతో వరద ముప్పునకు చెక్‌పడినట్లయింది. పాత హైలెవల్–పాత లోలెవల్ వంతెన మధ్యలో కొత్తగా చేపట్టిన భారీ వంతెన నిర్మాణాన్ని పూర్తి చేశారు.

రోడ్డు విస్తరణ

సాలూర మండల కేంద్రానికి సరిహద్దులో ఉన్న మహారాష్ట్ర ప్రాంత 63వ నంబర్ జాతీయ రహదారికి అనుసంధానం చేసేందుకు బోధన్ పట్టణ శివారు నుంచి సాలూర అంతర్రాష్ట్ర చెక్ పోస్టు వరకు 8.3 కిలో మీటర్ల పొడవున నాలుగు వరుసల రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. పట్టణ శివారులోని మర్రి మైసమ్మ ఆలయం సమీపం నుంచి నాగన్‌పల్లి, సాలూర క్యాంప్, సాలూర గ్రామాల మీదుగా రోడ్డు విస్తరణ పనులు సాగుతున్నాయి. ఈ మూడు గ్రామాల వద్ద చేపట్టిన బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు వివిధ దశలో ఉన్నాయి. నాగన్‌పల్లి గ్రామ అంచున ఉన్న పసుపు వాగుపై కొత్త వంతెన నిర్మాణం పనులు సాగుతున్నాయి. రోడ్డు విస్తరణ కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 35 కోట్లు మంజూరు చేసింది. మరో రెండు, మూడు నెలల్లో రోడ్డు విస్తరణ పనులు పూర్తయ్యే అవకాశాలున్నాయి. దీంతో అంతరాష్ట్ర రవాణా మరింత సులభతరం కానుంది.

అ'పూర్వ' సమ్మేళనం



జంగంపల్లిలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1998–99కి చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం సిల్వర్‌జూబ్లీ వేడుకలు నిర్వహించారు. 25 ఏళ్ల తర్వాత అందరూ ఒకే చోటికి చేరడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరిస్తూ నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. తాము చదువుకున్న పాఠశాల అభ్యున్నతికి కృషిచేస్తామని తీర్మానించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నమల్లారెడ్డిలో..

కామారెడ్డి రూరల్: మండలంలోని చిన్నమల్లారెడ్డిలో ఉన్న చైతన్య విద్యానికేతన్ పాఠశాలలో 2003–04కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం తమకు చదువు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ తానోబా ఆనంద్‌రావు, అడ్వయిజర్ సుమిత్రానంద్, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రావుట్లలో..

సిరికొండ: మండలంలోని రావుట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2005–06 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 18 ఏళ్ల తర్వాత కలిసిన వారు నాటి స్మృతులను నెమరువేసుకున్నారు. నాటి గురువులను ఘనంగా సన్మానించారు. సమ్మేళనంలో ఉపాధ్యాయులు ఫాతిమా జహర, శ్రీనివాస్, బాలయ్య, గంగామోహన్, శ్రీనివాస్, వేణుగోపాల్, సుదర్శన్, లింగం, శంకర్, బాబన్న, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రెండు నెలల నుంచి ఏర్పాట్లు



సిల్వర్ జూబ్లీ వేడుకల కోసం రెండు నెలల నుంచి స్నేహితులతో కలిసి ఏర్పాట్లు మొదలుపెట్టాం. మిత్రులందరినీ కలుసుకోవడం ఆనందంగా ఉంది. పాఠశాల అభ్యున్నతికి కృషి చేయాలని తీర్మానించాం. వేడుకలు విజయవంతమైనందుకు సంతోషంగా ఉంది. – అత్తెల్లి శ్రీనివాస్, జంగంపల్లి

50 రోజుల నుంచి ఎదురుచూశా..



తమ పదో తరగతి బ్యాచ్ సిల్వర్ జూబ్లీ నిర్వహిస్తున్నట్లు జంగంపల్లిలో ఉంటున్న మిత్రులు సమాచారం అందించారు. 50 రోజుల నుంచి ఈ వేడుకల కోసం ఎంతో ఎదురుచూశాను. 25 ఏళ్ల తర్వాత అందరం ఒకే వేదికపై కలిశాం. ఎంతో ఆనందంగా ఉంది. – రజిత, గజ్వేల్



చిన్నమల్లారెడ్డిలో..



రావుట్లలో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కొంగల సందడి



ఒకటి కాదు రెండు కాదు వందల సంఖ్యలో తెల్ల కొంగలు గోదావరి బ్యాక్ వాటర్ ప్రాంతంలో సందడి చేస్తున్నాయి. పచ్చని పొలాల్లో ఆహారం కోసం వాలిన కొంగలు ఒక్కసారిగా ఇలా పైకి లేచి కనువిందు చేశాయి. ఈ అద్భుతమైన చిత్రాన్ని 'సాక్షి' తన కెమెరాలో బంధించింది. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

దేవుని ఆవులే టార్గెట్..



మత్తు ఇంజక్షన్‌తో నిలబడలేని స్థితిలో ఉన్న ఆవు

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలో దేవుని ఆవులనే టార్గెట్ చేస్తూ దుండగులు వాటిని వాహనాల్లో దొంగిలిస్తున్నారు. ఈ విషయమై గ్రామస్తులు పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. మండల కేంద్రంలో ఇప్పటి వరకు 20 దేవుని కోసం వదిలిన ఆవులు అపహరణకు గురైనట్లు వారు పేర్కొన్నారు. రాత్రి సమయంలో ఆవులకు మత్తు ఇంజక్షన్ ఇచ్చి వాహనాల్లో తరలిస్తున్నట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది. శనివారం రాత్రి సైతం గుర్తు తెలియని వ్యక్తులు కారులో వచ్చి నాలుగు ఆవులకు మత్తు ఇంజక్షన్ ఇవ్వగా అవి నడవలేని స్థితిలో ఉండడంతో దుండగులు వాటిని వదిలేసి వెళ్లిపోయినట్లు సీసీ కెమెరాల్లో నమోదైంది. దీంతో మత్తు ఇంజక్షన్‌తో 20 గంటల పాటు మత్తు ఉండడంతో కూర్చున్న చోటే ఎండలోనే ఉండిపోయాయి. గ్రామస్తులు కొందరు వాటికి అక్కడే మేత, తాగునీరు అందించి చికిత్స చేయించారు. మఠం గల్లీలో ఉన్న ఓ పశువ్యాపారి కొట్టంలో నుంచి మూడు దూడలను ఎత్తుకెళ్లారు. పోలీసులు రాత్రి సమయంలో పెట్రోలింగ్ నిర్వహించి దుండగులను పట్టుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

క్రైం కార్నర్

పలువురిపై కేసు నమోదు

నవీపేట: పోలీస్ స్టేషన్ పరిధిలోని పొల్గా శివారులో దొంగతనానికి వచ్చిన వ్యక్తిని హత్య చేసిన ఘటనలో పలువురిపై కేసు నమోదు చేసినట్లు నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీశ్ ఆదివారం పేర్కొన్నారు. మూతపడిన వెంకటేశ్వర రైస్‌మిల్‌లో దొంగతనానికి వచ్చిన డిచ్‌పల్లి మండలంలోని సుద్దపల్లి తండాకు చెందిన సునీల్ గ్రామస్తుల చేతిలో హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ ఘటనలో మృతుడి భార్య సక్కుబాయి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు పలువురిపై కేసు నమోదు చేశారు. విచారణ కొనసాగుతోందని సీఐ పేర్కొన్నారు.

విద్యుత్ కెపాసిటర్ సెల్ పేలి ఒకరికి గాయాలు



లింగంపేట: మండలంలోని పర్మళ్ల 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో విద్యుత్ కెపాసిటర్ సెల్ పేలడంతో ఆపరేటర్ చిలుక అంజయ్యకు తీవ్రగాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. ఆపరేటర్ అంజయ్య సబ్‌స్టేషన్‌లో కెపాసిటర్ బ్యాంకును ఆన్ చేస్తుండగా సాంకేతిక లోపంతో సెల్ పేలిపోవడంతో అందులో అయిల్ మంటలు వ్యాపించాయి. దీంతో ఆపరేటర్ చేతులు, మొకంపై పడడంతో తీవ్రగాయాలయ్యాయి. బాధితుడిని ఉన్నత వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

అత్తింటి వేధింపులు తాళలేక ఆత్మహత్య

బోధన్‌టౌన్: పట్టణంలోని శక్కర్‌నగర్‌లో నివాసం ఉంటున్న సహాబా నౌషీన్(37) భర్తతో పాటు అత్తింటి వేధింపులు తాళలేక ఆదివారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్‌కు చెందిన సహాబా నౌషీన్‌కు 9 ఏళ్ల క్రితం అబ్దుల్ సల్మాన్‌తో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. సహాబా నౌషీన్ ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం అందడంతో ఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టినట్లు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, మృతురాలి తండ్రి ఎండీ మక్బూల్ హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్



మాచారెడ్డి: పాల్వంచ మండలం భవానిపేట వాగు, ఫరీదుపేట లొట్టి వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వేర్వేరు ఘటనల్లో ఆదివారం రెండు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు మాచారెడ్డి ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

తనయుడిని హత్య చేయించిన తల్లి అరెస్ట్

- నిందితుల రిమాండ్



కేసు వివరాలను వెల్లడిస్తున్న ఏఎస్పీ కాజల్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): జల్సాలకు అలవాటు పడిన కొడుకు నిత్యం తల్లిని వేధించడంతో విసిగిపోయిన ఆ తల్లి కొడుకును హత్య చేయించిన ఘటన మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డిలో చోటు చేసుకుంది. ఏఎస్పీ కాజల్ ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. అడ్లూర్ ఎల్లారెడ్డి శివారులో గత నెల 25న గుర్తు తెలియని మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉందన్న సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. విచారణలో లింగంపేట మండలంలోని పొల్కంపేటకు చెందిన కదాల సాయిలు మృతదేహంగా పోలీసులు గుర్తించారు. కాగా తల్లి కదాల లచ్చవ్వను విచారించగా తన కుమారుడిని తానే హత్య చేయించినట్లు ఒప్పుకుందన్నారు. సాయిలుకు ఏడు వివాహాలు అయ్యాయని, జల్సాలకు అలవాటు పడి తమకున్న ఆస్తులను అమ్మడంతో పాటు నిత్యం తనను వేధించేవాడని తల్లి లచ్చవ్వ తెలిపింది. దీంతో కొడుకు ప్రవర్తనతో విసిగిపోయిన లచ్చవ్వ సాయిలును హత్య చేయాలని బంధువైన కమ్మర్‌పల్లి మండలం నాగాపూర్‌కు చెందిన బసకొండ దేవుకు సమాచారం అందించింది. దీంతో అతడు అతని మిత్రుడు కోట మారుతితో కలిసి గత నెల 24న సాయిలుకు అతిగా మద్యం తాగించి గొంతుకు టవల్ బిగించి హత్య చేశారు. సాయిలును హత్య చేసిన దేవు, మారుతి, లచ్చవ్వలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ తెలిపారు. కేసును చేదించిన సీఐ సంతోష్, ఎస్సై రాజు, పీసీ రవి, హమీద్‌లను అభినందించారు.

నిర్మాణ సామగ్రి చోరీ

బాన్సువాడ రూరల్: మండల కేంద్రంలోని తాడ్కోల్ చౌరస్తా బ్యాంక్ ఎదురుగా చేపడుతున్న ఇంటి నిర్మాణ సామగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం చోరీకి పాల్పడ్డారు. నూతన ఇంటి నిర్మాణం కోసం తెచ్చిన ఐరన్ రాడ్స్, ఇతర సామగ్రి దొంగిలించారని యజమాని శ్రీనివాస్ తెలిపాడు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు శ్రీనివాస్ పేర్కొన్నాడు.

వాహనాల తనిఖీ

తాడ్వాయి: మండల కేంద్రంలోని కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై పోలీసులు ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వాహన ధ్రువీకరణ పత్రాలు, హెల్మెట్, సీటు బెల్టు లేని వాహనదారులకు జరిమానా విధించారు. అంతేకాకుండా ఎంపీ ఎన్నికల నేపథ్యంలో ప్రతి వాహనాన్ని క్షుణంగా తనిఖీ చేశారు. తనిఖీలో కానిస్టేబుళ్లు, హోంగార్డులు ఉన్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు




లింగంపేట: తండ్రికి కూతురు తలకొరివి పెట్టి రుణం తీర్చుకున్న ఘటన తాడ్వాయి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన మెట్టు బాలరాజు అనారోగ్యంతో మృతి చెందాడు. బాలరాజుకు కుమారులు లేకపోవడంతో కుమార్తె జ్యోతి తండ్రికి తలకొరివి పెట్టారు. ఈ ఘటన చూసిన గ్రామస్తులు కంటతడి పెట్టారు. గ్రామానికి చెందిన ఆయా రాజకీయ పార్టీల నాయకులు అంత్యక్రియల్లో పాల్గొని బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ట్రాక్టర్, స్కూటీ ఢీ: ఒకరి మృతి

జక్రాన్‌పల్లి: సికింద్రాపూర్ గ్రామ శివారులోని జాతీయ రహదారిపై ట్రాక్టర్ స్కూటీ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందినట్లు ఏఎస్సై సునీల్‌కుమార్ ఆదివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. సికింద్రాపూర్‌కు చెందిన తలారి బొర్రన్న(46) పని నిమిత్తం గన్యతండాకు వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో సికింద్రాపూర్ పెట్రోల్ బంక్ సమీపంలో జాతీయ రహదారిపై వెనుక నుంచి వచ్చిన ట్రాక్టర్ స్కూటీని ఢీకొన్నది. ఈ ఘటనలో స్కూటీపై ఉన్న బొర్రన్న తలకు తీవ్రగాయం కావడంతో ఘటన స్థలిలోనే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో మరొకరు..



ఇందల్వాయి: మండలంలోని చంద్రాయన్‌పల్లిలో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇందల్వాయికి చెందిన దేవరి గంగారాం(55) మృతి చెందినట్లు ఎస్సై మనోజ్ తెలిపారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగారాం సైకిల్‌పై కామారెడ్డి జిల్లా పజ్జెపల్లిలోని తన బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొన్నది. ఈ ఘటనలో గంగారాం అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కొలిప్యాక్‌లో..

జక్రాన్‌పల్లి: మండలంలోని కొలిప్యాక్‌కు చెందిన ఆరెపల్లి గంగాధర్ (40) ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. గ్రామంలో గంగాధర్ వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం గుండెపోటుకు గురై మరణించాడు. దీంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య శారద, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.